మహా శివరాత్రి వేడుకలకు ఆలయాలు సిద్ధం


టి.నగరపాలెంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం


సంగివలసలోని పురాతన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం


తాటితూరులోని పురాతన ఉత్తర రామలింగేశ్వర ఆలయం


పూజలకు సిద్ధమైన కాశీ విశ్వేశ్వరుడు

తగరపువలస: మహా శివరాత్రి వేడుకలకు చిట్టివలస, సంగివలస, తగరపువలస, భీమిలి మండల పరిధిలో శివాలయాలు ముస్తాబయ్యాయి. దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని 400 ఏళ్ల చరిత్ర కలిగిన సంగివలస ఉమారామలింగేశ్వర ఆలయం, భీమిలి మండలం తాటితూరు ఉత్తర రామలింగేశ్వర ఆలయాల్లో శనివారం ప్రధాన అర్చకులతో మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. మండలంలోని అమనాం, బసవపాలెం, మూలకుద్దు, లక్ష్మీపురం, ఇటీవల టి.నగరపాలెంలో నిర్మించిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల కమిటీ ప్రతినిధులు కూడా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేయడంతోపాటు శివపార్వతులకు కల్యాణం, రుద్రాభిషేకాల నిర్వహణకు సిద్ధం చేశారు. జీవీఎంసీ పరిధిలో గోస్తనీనది తీరాన ఉన్న బంగ్లామెట్ట, సంతపేట, సత్యనారాయణపేట, కొండపేట, చిట్టివలస పరిధిలో మహాశివరాత్రి ఉత్సవాలు జరపనున్నారు. ఇప్పటికే అభిషేకాలకు ఆలయ కమిటీల వద్ద భక్తులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి టెంట్లు వేశారు. ఆలయాల్లో జాగరణ ఏర్పాటులో భాగంగా భజన బృందాలు శివపంచాక్షరి నామాన్ని ఆదివారం ఉదయం వరకు ప్రతిధ్వనించనున్నారు.

భీమిలిలో చారిత్రక శివాలయాలు


భీమునిపట్నం: భీమిలిలో ఒకే ప్రాంగణంలో వున్న పురాతన శివాలయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ద్వాపరయుగ కాలంలో పాండవుల అజ్ఞాతవాస సమయంలో భీముడు తన స్వహస్తాలతో భీమేశ్వర కాత్యాయని ఆలయంలో శివలింగం ప్రతిష్ఠించాడని స్థానికులు భావిస్తున్నారు. అలాగే 11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించిన చోడేశ్వర భ్రమరాంబిక ఆలయం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ అప్పటి రాజు, రాణి విగ్రహాలు న్నాయి. ఈ ఆలయాల పక్కనే 17వ శతాబ్దంలో విజయనగర సంస్థానాధీశులు చంద్రశేఖర బాలత్రిపుర సుందరి ఆలయాన్ని నిర్మించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ ఆలయాల్లో భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. పద్మనాభంలోని నారాయణేశ్వరస్వామి ఆలయం వద్ద పరమేశ్వరుని విగ్రహాన్ని భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతవరం ధారకొండపై వెలసిన శ్రీమన్నారయణేశ్వరస్వామి, పొట్నూరులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి, కురపల్లిలోని రామచంద్ర రామలింగేశ్వర స్వామి, గంధవరం, తునివలస గ్రామాల్లోని కాశీ విశ్వేశ్వరస్వామి, బి.ఆర్.తాళ్లవలసలోని సర్వేశ్వర వల్లభ నారాయణేశ్వరస్వామి, గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, రెడ్డిపల్లిలోని శివాలయాలను ముస్తాబు చేశారు.


భీముడు నిర్మించినట్టు భావిస్తున్న భీమేశ్వర కాత్యాయని ఆలయం


చోడేశ్వర ఆలయంలో అప్పటి రాజు, రాణి విగ్రహాలు


నారాయణేశ్వర స్వామి ఆలయం వద్ద పరమేశ్వరుని విగ్రహం


పద్మనాభంలోని నారాయణేశ్వరస్వామి ఆలయం

క్లుప్తంగా

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

తగరపువలస: వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు భీమిలిలో మొకర నారాయణరావు ఉచిత స్టడీ సర్కిల్‌ను ప్రారంభించినట్టు విశ్రాంత ప్రిన్సిపాల్ కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. ముఖ్యంగా సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు సంబంధించి వ్యాస రచన, జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్, రీజనింగ్, ప్రభుత్వ పాలనాశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర, సామాజికశాస్త్రం, తెలుగు, హిందీ సాహిత్యాలకు నిష్ణాతులతో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89856 47419లో సంప్రదించాలని కోరారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు మంగళవాయిద్యాల నడుమ టీటీడీ అర్చకులు పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై హర్షం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో ప్రభుత్వం చేపడుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంపై స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో శిథిలమైన డ్రైనేజీలు, రహదారుల నిర్మాణానికి తాను పలుమార్లు భీమిలి జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఆ పార్టీ 1, 2 వార్డుల అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి అన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కూడా స్థానికులు ఈ సమస్య తీసుకెళ్లారన్నారు. సచివాలయ పరిధిలో విడుదలైన నిధులతో పనులు చేపడుతుండడంతో నాయకులను, అధికారులను ఆమె అభినందించారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న గణేష్ మాదిగ

పద్మనాభం: ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర నాయకుడు దేవరాపల్లి గణేష్ మాదిగ అన్నారు. మండలంలోని పెంట ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహాల వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, రాజకీయంగా ఎదుగుదలకు, కొన్ని గ్రామాల్లో ఉన్న ఎస్సీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కింతాడ దేముడు, దేవరపల్లి రమణమ్మ, నిమ్మకాయల ఆదిలక్ష్మి, నరిసింగరావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ శుక్రవారం తెలిపారు. అర్థశాస్త్రం సబ్జెక్టు ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతోపాటు జెరాక్స్ సెట్‌తో డెమో క్లాస్ నిర్వహించడానికి ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య

తగరపువలస: విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడి హేయమైన చర్య అని జిల్లా పీఆర్‌టీయూ ఉపాధ్యక్షులు గరికిన పరదేశి, సత్యం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు సమంజసం కాదన్నారు. ఉన్నత విద్యాశాఖాధికారిగా విద్యాభివృద్ధికి పాటుపడుతూ విస్తృతస్థాయిలో పర్యటిస్తున్న ఆయనకు పీఆర్‌టీయూ అండగా ఉంటుందన్నారు. రాత్రివేళ విశ్రాంతి సమయంలో దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ కల్పలతకు వారు సంఘీభావం తెలిపారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం


శివ పార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

పద్మనాభం: విలాస్కాన్‌పాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం పార్వతి పరమేశ్వరులకు కల్యాణం జరిపించారు.

సర్పంచ్ నల్లి సత్యవతి, ఆలయ కమటీ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తగరపువలస: స్థానిక చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న బస్‌షెల్టర్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం చోరీ చేశారు. విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందిన వెంపడాపు రాజారావు అనే వ్యక్తి ఏపీ 35 ఏఎల్ 4621 నంబరు గల బైక్‌ను సాయంత్రం పార్క్ చేసి వెళ్లి తిరిగివచ్చి చూడగా కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడే సర్వీస్ రోడ్డులో ఫాస్ట్‌ఫుడ్ దుకాణం వద్ద నూడిల్స్ తిని వారే ఆ వాహనాన్ని తీసుకుపోయినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నూడిల్స్ తిన్న వ్యక్తులు బిల్లు ఫోన్‌పే ద్వారా చెల్లించారని... దాని ఆధారంగా బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

భీమునిపట్నం: విద్యార్థులు చదువుకునే దశలో మాదక ద్రవ్యాల వాడకాన్ని అలవాటు చేసుకుంటే జీవితాలు నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రామకృష్ణ అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమైనవని, వాటికి కొందరు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. చదువు, భవిష్యత్ పూర్తిగా పాడైపోవడంతోపాటు ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. తద్వారా వారి జీవితాలు పూర్తిగా నాశనమైపోతాయన్నారు. అందువల్ల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్‌ఐ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లిష్ మీడియం విద్యాభ్యాసంతో ప్రయోజనాలు


కార్యక్రమం ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

పీఎం పాలెం : ప్రపంచ భాష ఇంగ్లిష్ మీడియంలో విద్యను అభ్యసించడం వల్ల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శిల్పారామంలో మధురవాడ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 30వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంగ్లభాషలో మంచి ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. అనంతరం ఏపీపీఎస్‌ఏ రాష్ట్ర చైర్మన్ కేఎస్ఎన్ మూర్తి, ఏయూ విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీఏస్ఎన్ సోమయాజులు మాట్లాడారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మేయర్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జె.ఉషశ్రీ, బీవీ మురళి మనోహర్ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్లలో తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారుల హెచ్చరిక


చంద్రంపాలెం వద్ద వాటర్ ప్లాంట్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు


శుద్ధి చేసిన నీటిలో కలిపే మినరల్స్ బాటిల్ పరిశీలిస్తున్న అధికారి

మధురవాడ: వేసవి సమీపించడంతో నిబంధనలు తుంగలో తొక్కిన మినరల్ వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, జీవీఎంసీ శానిటేషన్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం మెరుపు దాడులు చేశారు. నీటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా..? లేదా..? అనే విషయాలతోపాటు నిబంధనల మేరకు విద్యుత్ వాడుతున్నారా..? అని పరిశీలించారు. పరిశుభ్రత ఎలా ఉందో చూశారు. జాతీయ రహదారిని ఆనుకుని చంద్రంపాలెం, మధురవాడ వద్ద ఉన్న రెండు మినరల్ వాటర్ ప్లాంట్లలో మధ్యాహ్నం ఒకే సమయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా, ఇతర నిబంధనలు పాటించకుండా నీటి వ్యాపారం చేస్తుండడాన్ని గమనించారు. చంద్రంపాలెం వద్ద ఉన్న సూర్య ఆక్వా నిర్వాహకులు లైసెన్స్ లేకుండానే ఓ ప్రముఖ బిస్లరీ వాటర్ సంస్థ బోర్డు పెట్టి మరీ వ్యాపారం చేస్తుండడాన్ని అధికారులు గమనించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ తిరుపతిరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్.ఆనందరావు మాట్లాడుతూ శాంపిల్స్ సేకరించామని, వాటిని పరీక్షించిన తర్వాత చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న దాడుల్లో భాగంగా ఇక్కడ తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరికి కుంకుమార్చన


మహా కామేశ్వర స్వామి ఆలయంలో కుంకుమ పూజలు


కలశ స్థాపన చేస్తున్న సురేష్ తదితరులు

మధురవాడ: మహా శివరాత్రి ఉత్సవాల రెండో రోజున శుక్రవారం లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. సాయంత్రం 108 కలశాల్లో ప్రత్యేక జలాలు నింపి స్థాపన చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, అప్పారావు, మెండ సింహాచలం, సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం, సిద్దేశ్వర స్వామి పీఠం తదితర ఆలయాలు మహా శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. వేకువజాము నుంచే ఇక్కడ అభిషేకాలు, అర్చనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దేశానికి విజ్ఞాన ఆధారిత ఆర్థిక ప్రగతి అవసరం



మాట్లాడుతున్న వీసీ దయానంద సిద్ధవటం

కొమ్మాది: ప్రజా సంక్షేమంతో పాటు సంపదను సృష్టించే ఆర్థిక వ్యవస్థను రూపొందించాలని, ముఖ్యంగా విజ్ఞాన ఆధారిత ఆర్థిక ప్రగతి దేశానికి ఎంతో అవసరమని గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండియన్ పొలిటికల్ ఎకానమీ అసోసియేషన్ (ఐపీఈఏ) 26వ వార్షిక సమావేశాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

డంపింగ్ యార్డు రోడ్డులో డెబ్రిస్ తొలగించాలి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు


కాపులుప్పాడ డంపింగ్ యార్డులో పర్యటిస్తున్న రాజాబాబు


పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మధురవాడ: కాపులుప్పాడ డంపింగ్ యార్డు రహదారిలో నిర్మాణ వ్యర్థాలు, డెబ్రిస్‌ను (సీ అండ్ డీ వేస్టు) యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కాపులుప్పాడ డంపింగ్ యార్డు, మారికవలస తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ప్రధాన గేటు వద్ద వ్యర్థాలు లేకుండా శుభ్రంగా ఉంచి, ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. సుందరీకరణ కోసం మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. చెత్త ఏరుకునేవారు డంపింగ్ యార్డులో నివసిస్తున్నారని, వారిని వెంటనే ఖాళీ చేయించాలని, ఇక్కడ ఉన్న వే బ్రిడ్జిని ఆధునీకీకరించాలని ఆదేశించారు. హై ఓల్టేజీ వల్ల వే బ్రిడ్జిలో అప్పుడప్పుడు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నందున ఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆమోదించిన పార్కును త్వరితగతిన ఆధునికీకరించి అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్ శాస్త్రి, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు పూర్తి చేయండి

కొమ్మాది: త్వరలో జీ – 20 సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో తీరం వెంబడి సుందరీకరణ, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన సాగర్‌నగర్, ఇస్కాన్ టెంపుల్, గుడ్లవానిపాలెం, రుషికొండ, సీతకొండ వ్యూ పాయింట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంజినీరింగు పనులు సరిగ్గా నిర్వహించకపోవడంతో సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జీ – 20 సదస్సుకు సమయం తక్కువగా ఉన్నందును పనుల్లో అలసత్వం వహిస్తే క్షమించేది లేదని, పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


చిప్పాడ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావుకు డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. శుక్రవారం ఆమె హైస్కూల్‌లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని, బైజూస్ యాప్ వినియోగాన్ని పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలు పరిశీలించి ఉపాధ్యాయులు దిద్దుతున్నారా..? లేదా..? చూశారు.

ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్లు, డైరీలు, మార్కుల జాబితా పరిశీలించారు. 3 నుంచి 10వ తరగతి వరకు ఎనిమిది క్లాసులు నాలుగు గదుల్లో నిర్వహిస్తుండడాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆమెతోపాటు స్కూల్‌ను డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, భీమిలి ఎంఈవో కేఏ బాలామణి పరిశీలించారు.